


# కొండముచ్చు-మల్లెపువ్వు

కొంపెల్ల విశ్వం

**వానాకాలంలో** వానలు బాగా పడుతున్నప్పుడు మట్టి రోడ్డు ఎలా ఉంటుందో సరిగ్గా అలానే ఉంది ఆ మట్టి రోడ్డుకూడా. వానా కాలంలో మట్టి రోడ్డుమీద ఎడ్లబండి ఎలా వెడుతుందో సరిగ్గా అలానే వెళ్ళుతూంది ఆ ఎడ్లబండి కూడా.

ఎడ్లబండిని రంగడు తోలుతున్నాడు. బండిలో పెద్ద బరువేమీ లేకపోవడంతో తొట్టెలో కూర్చునే బండి తోలుతున్నాడు రంగడు.

వాన కురవడం లేదు. కానీ రాజారావు చేతిలో గొడుగు ఉంది. పొగ రావడంలేదు. కానీ రాజారావు నోటిలో చుట్ట ఉంది. అతను ప్రశాంతంగా కనిపిస్తున్నాడు. కానీ అతని మనసులో ఏవేవో ఆలోచనలున్నాయి.

అలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ రంగడు తోలుతున్న ఎడ్లబండి పక్కనుంచి పోదామనుకున్నాడు రాజారావు. ఆ వూరి రైతుల్లో మోతుబరి రాజారావు. ఎడ్లబండిని దాటి ముందుకు పోవాలన్నది అతని ప్రయత్నం. ఆ ప్రయత్నంలో అప్రయత్నంగా ఎడ్లబండి లేపిన బురద రాజారావు పంచె మీద పడింది. రాజారావు వూహల్లోంచి వాస్తవం లోకి వచ్చాడు. గబగబా బండి ముందుకు పడి అడిగాడు:

"ఏరా, కళ్ళు మూసుకుపోతున్నాయా? ఏటా బండి తోలడం!"

రాజారావుని చూడగానే బండి మీద నుంచి కిందికి దూకి వినయంగా చేతులు కట్టుకుని అడిగాడు రంగడు:

"ఏ మపచారం జరిగి పోయిందండీ?"

"అపచార మేమిట్రా, కొండముచ్చు వెధవా! నా మల్లెపువ్వు లాంటి పంచె చూడు, ఎలా తగులబడిపోయిందో!" పంచె చూపించాడు రాజారావు. చూశాడు రంగడు.

"నేను చూళ్ళేదండి. చూస్తే తమరి పంచె పాడయ్యేది కాదండి."

"నోర్మూయ్! వెధవ కబుర్లూ నువ్వూను. కావాలనే అలా బండి తోలుంటావ్."

"అయి బాబదేటండి! చూసికూడా అట్టా ఎందుకు తోలాతానండి?"

"ఎందుకా— ఒళ్ళు కొవ్వెక్కి, తిన్న దరక్క. నే నేం చేస్తానో, ఏం చేయగలనో చూద్దామని. అంతేనా!"

"తప్పయిపోయా దంటున్నా కదా— క్షమించేయండి."

"పాపి చెంపకాయ కొట్టి క్షమించ మన్నాడట నీ లాంటి వాడే. తప్పు చేసే యడం, క్షమించమనేయడం అన్నీ నీ ఇష్టమేనా?"

"తెలీక చేసాను. వదిలేయండి, బాబూ!"

"ఏడిశావ్! ఇలా ప్రతి సారీ మిమ్మల్ని మన్నించి వదిలేస్తున్నాం కాబట్టే మీరిలా మా నెత్తి కెక్కుతున్నారు. మిమ్మల్ని ఇక ఉపేక్షించి లాభం లేదు." ఆవేశంగా అన్నాడు రాజారావు.

మళ్ళీ ప్రాధేయ పడ్డాడు రంగడు. మరింత ఆవేశ పడ్డాడు రాజారావు. రంగడికి చిర్రెత్తుకొచ్చింది.

"ఏటయ్యా నీ యవ్వారం మా జోరుగా ఉంది! నేనేమో నా మానాన బండి తోలుకు పోతుంటే, [illegible] మంచి మన్నాన్ని నా బండిని దాటి ముందుకు పోబోతుంటే నీ పంచెమీద బురద పడితే నాదా తప్పు? ఏదో పెద్ద మనిషివి గదా అని ఒదిగి ఒదిగి మాట్లాడుతుంటే తారాజువ్వ లాగ ఎగిరెగిరి పడతున్నావే! ఎళ్ళెళ్ళ. ఎళ్ళి ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ ఎడ్లను అదిలించి, చక్రం ఆకుల మీద కాలేసి బండి తొట్టెలో కూర్చున్నాడు రంగడు.

రంగడు మెత్తగా మాట్లాడినంత కాలం జోరుగా మాట్లాడిన రాజారావు మరి నోరెత్త లేదు.